క్లుప్తంగా

మద్యంసీసాల స్వాధీనం



పట్టుబడిన మద్యంసీసాలు చూపిస్తున్న ఎక్సైజ్ సీఐ చిన్నంనాయుడు

రామభద్రపురం: మండలంలోని పాడివానివలస వద్ద అక్రమంగా తరలిస్తున్న 13 మద్యంసీసాలు శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

ప్రతీ విద్యార్థి ఏ–గ్రేడ్‌లో ఉండాలి

రేగిడి: ప్రతీ విద్యార్థి ఏ–గ్రేడ్‌లో ఉండేలా చూడాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని పనసలవలస గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, గురుకుల పాఠశాల, కేజీబీవీల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల సమావేశం శనివారం నిర్వహించారు. చదువులో వెనకబడిన విద్యార్థి విద్యా ప్రగతికి కృషి చేయాలని ఆయన తెలిపారు.

భూ ఆధార్ నమోదుపై శిక్షణ



వీఆర్‌వోలకు శిక్షణ ఇస్తున్న ఏడీ శ్యామసుందర్

బొబ్బిలిరూరల్: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో భూ ఆధార్ నమోదుపై వీఆర్‌వోలకు శనివారం శిక్షణ ఇచ్చారు. సొంత భూమి కలిగిన రైతులందరి చేత భూ ఆధార్ చేయించాలని వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ తెలిపారు. మండలంలో ఇప్పటివరకు ఆరు వేల మంది రైతులు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, మరో ఏడు వేల మంది పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అంతకుముందు రైతుల భూ వివరాలు, పేర్లు ఏ విధంగా నమోదు చేయాలన్న దానిపై ఏడీ శిక్షణ ఇచ్చారు.

జాబ్‌కార్డు ఉంటేనే పనులకు అనుమతించండి



వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో హరనాథ్

రేగిడి: జాబ్‌కార్డు ఉన్న వారిని మాత్రమే ఉపాధి హామీ పథకం పనులకు అనుమతించాలని ఏపీవో ఎస్.హరనాథ్ సూచించారు. మండలంలోని రేగిడి, ఆమదాలవలస, కొత్త చెలికానివలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శనివారం పరిశీలించి, వేతనదారులకు పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 35 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయని, 4200 మంది వేతనదారులు పనుల్లో పాల్గొంటున్నారన్నారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందన్నారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూడాలన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సులోచన

రాజాం సిటీ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా ఎటువంటి అంశాలపై చర్చించ లేదు. ప్రభుత్వ శాఖల పనితీరుపై పలువురు అధికారులను ఎంపీపీ అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై ఎంఈవో పి.ప్రవీణ్‌కుమార్, ఉపాధి హామీ పథకం పనులపై ఏపీవో సాయిరాం వివరాలు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం చాలా మంచిదని, ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ ఓజేసీపీ కుమార్ కోరారు. సమావేశంలో ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువు తయారు చేసుకోండి

రాజాం: స్థానిక పట్టణంలోని మారుతీనగర్, డోలపేట, వాసవీనగర్ తదితర వార్డుల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ శనివారం పర్యటించి, హోమ్ కంపోస్టింగ్(ఇంటి వద్దనే ఎరువులు తయారు చేసుకునే విధానం)పై అవగాహన కల్పించారు. ఇంట్లో వ్యర్థాలు బయట విచ్చలవిడిగా పారేయకుండా ఎరువు తయారు చేసుకుని, ఇంట్లోని పూల మొక్కలు, కూరగాయల మొక్కలకు వినియోగించుకోవాలని తెలిపారు.

కష్టపడ్డాం.. కూలివ్వరేం..?

- ‘ఉపాధి’ వేతనదారుల అవస్థలు
- 6 వారాలుగా అందని వేతనాలు
- నియోజకవర్గంలో రూ.1.99 కోట్ల బకాయిలు
- పనుల్లో 15 వేల మంది



రామభద్రపురం జీడిమామిడి తోటల్లో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీవో త్రినాధరావు(ఫైల్)

రామభద్రపురం: వ్యవసాయం తర్వాత పేదలకు అండగా నిలుస్తున్నది ఉపాధి హామీ పథకమే.. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలసల నివారణే లక్ష్యంగా ఎన్‌ఆర్‌ఈజీఎస్(మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం)ను ప్రవేశపెట్టడం జరిగింది. వేతనదారులకు 100 రోజుల పనిదినాలు కల్పించడమే కాకుండా గిట్టుబాటు అయ్యే వేతనం ఇస్తుండడంతో ఈ పనులపైనే చాలామంది ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈ విధంగా ఎంతో కొంత ఆసరాగా ఉంటోందనుకుంటున్న పథకం పలుచోట్ల వేతనదారులకు అవస్థలు పెడుతోంది. పథకం కింద మూడు నెలల పాటు పనిదినాలు కల్పిస్తే అందులో ఏకంగా రెండు నెలల పనిదినాలకు సంబంధించిన కూలి డబ్బులు(వేతనాలు) జమ కాలేదు. దీంతో బాధిత వేతనదారుల కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. కష్టపడ్డాం.. కూలివ్వరేమని ప్రశ్నిస్తున్నారు. తక్షణమే తమ బకాయి వేతనాలు జమ చేయాలని కోరుతున్నారు.

బొబ్బిలి నియోజకవర్గంలోని బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం, బాడంగి మండలాల్లో ఆరు వారాలుగా ఉపాధి పనులకు వెళ్తున్న వారికి డబ్బులు ఇవ్వలేదు. దీంతో వేతనదారులకు ఇవ్వాల్సింది మొత్తం రూ.1.99 కోట్లు బకాయిగా ఉంది. రామభద్రపురం మండలంలో రూ.35 లక్షలు, బొబ్బిలి మండలంలో రూ.54 లక్షలు, తెర్లాం మండలంలో రూ.45 లక్షలు, బాడంగి మండలంలో రూ.65 లక్షల నిధులు వేతనదారులకు అందివ్వాల్సి ఉంది. ప్రస్తుతం 15 వేల మందికి పైగా వేతనదారులకు ఉపాధి పనులకు వెళ్తున్నారు. బకాయి వేతనాల కోసం ఎదురు చూస్తున్న వారంతా చిన్న, సన్నకారు రైతులు, కూలీలే. ఉపాధి డబ్బులు అందక రబీ సాగుకు పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ప్రభుత్వం సాయం చేయక, మరో వైపు చేసిన పనులకు డబ్బులు అందక వారంతా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఎటువంటి వ్యవసాయం చేయని, కూలి పనులపైనే ఆధారపడి కడుపు నింపుకుంటున్న వారికి ఉపాధి డబ్బులు ఇంతవరకు అందకపోతే వారెలా జీవిస్తారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

చేతిలో చిల్లిగవ్వ లేదు..



కూలి పనులకు వెళ్తే గానీ పూట గడవని కుటుంబం మాది. ఆరు వారాలుగా చేసిన పనికి వేతనాలు జమ కాలేదు. ఉపాధి సిబ్బందిని అడిగితే ఇదిగో వస్తాయి.. అదిగో వస్తాయని చెబుతున్నారు. చేతిలో చి ల్లిగవ్వ లేదు. ఇలా అయితే ఎలా బతకాలి. చేసిన పని డబ్బులు అందితే మేలు.
–బొబ్బిలి రాజేశ్వరి, వేతనదారు, రామభద్రపురం

రెండు నెలలుగా అందడం లేదు..



రెండు నెలలుగా ఉపాధి కూలి డబ్బులు జమ కాలేదు. వర్షాలు లేకపోవడంతో పొలం పనులు కూడా లేవు. ఉపాధి పనికి వెళ్తే రోజైనా గడుస్తుందని రోజూ పనికి వెళ్తున్నాం. చేసిన పనికి కూడా ఇప్పుడు డబ్బులు రావడం లేదు. ఇన్ని వారాల పాటు డబ్బులు ఇవ్వకుంటే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి.
–పరమేశ్వరరావు, వేతనదారుడు, రామభద్రపురం

గిట్టుబాటు అయ్యే వేతనం అందివ్వాలి..



ఉపాధి హామీ పథకం పనులే మాకు ఆధారం, భార్యాభర్తలం కలిసి పనికి వెళ్తే ఇద్దరికి కనీసం రూ.500 కూడా రావడం లేదు. గిట్టుబాటు అయ్యే వేతనం అందేలా చూడాలి. అలాగే ఎప్పటి డబ్బులు అప్పుడు వేయాలి.
–బి.సుందరరావు, వేతనదారుడు, నేరళ్లవలస

వేతనాలు పెండింగ్‌లో ఉన్నది వాస్తమే..



ఉపాధి కూలి డబ్బులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవమే. ఆరు వారాల పనులకు సంబంధించిన బిల్లులు అప్‌లోడ్ చేసేశాం. రెండు, మూడు రోజుల్లో వేతనదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యే అవకాశం ఉంది. కొలతల ప్రకారం తీఎనిచేస్తే రోజుకు రూ.300 వేతనం వస్తుంది.
–రత్నం, ఎంపీడీవో, రామభద్రపురం

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు.. పొలాల్లోనే వరికుప్పలు..



ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతుల వద్ద ధాన్యం నిల్వలు భారీగా ఉండిపోయాయి. కొన్నిచోట్ల పొలాల్లోనే వరికుప్పలు ఉండగా, మరికొన్ని చోట్ల రైతుల వద్ద బస్తాల కొద్దీ ధాన్యం ఉన్నాయి. కొనుగోళ్లు చేస్తే తామంతా ధాన్యం అమ్మేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు అంటున్నారు. ట్రాక్టర్ల ద్వారా పొలాల్లో నుంచి వరిచేను తరలిస్తే అప్పటికే పొలాల్లో సాగులో ఉన్న అపరాల పంటలకు నష్టం వస్తుందేమోనన్న భయంతో చేను తరలించలేదని చెబుతున్నారు. ఇప్పుడేమో లక్ష్యం పూర్తయింది.. ధాన్యం కొనుగోళ్లు చేయలేమని అటు అధికారులు ఇటు ప్రభుత్వం చేతులెత్తేసిందని వాపోతున్నారు. సంతకవిటి మండలంలోని వాసుదేవపట్నం, సిరిపురం, మంతిన, వాల్తేరు, మందరాడ, రంగారాయపురం, కేఆర్ పురం తదితర గ్రామాల్లో ఇలా పెద్దఎత్తున పొలాల్లోనే వరికుప్పలు ఎదురుచూస్తున్నాయి. ఈ చిత్రంలో కనిపిస్తోంది.. వాసుదేవపట్నం, పోతులజగ్గుపేట మధ్య పొలాల్లోని వరికుప్పలు.
–సంతకవిటి

కోనేరు కబ్జాను అడ్డుకోండి



రామభద్రపురం మండలం, కొట్టక్కి గ్రామ కోనేరు(చెరువు) కబ్జాను అడ్డుకోవాలని సీపీఎం నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం కోరారు. ఇదే విషయమై వారు బొబ్బిలి ఆర్డీవో కార్యాలయానికి శనివారం వెళ్లి, ఆర్డీవో రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. సర్వే నంబరు 143–5లోని ఎకరా విస్తీర్ణంలోని చెరువు ఏడాది కాలంగా క్రమక్రమంగా ఆక్రమణకు గురవుతోందని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండు రోజులుగా గ్రావెల్ వేసి చదును చేస్తున్నారని తెలిపారు. ఈ ఆక్రమణపై గతంలో కలెక్టరు, తహసీల్దారులకు ఫిర్యాదు చేశామని, నోటీసు ఇచ్చి ఊరుకున్నారన్నారు. కళ్లముందే రూ.10 కోట్ల విలువైన కోనేరు రూపు కోల్పోతుంటే అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండడం ఎంతవరకు సమంజసమన్నారు. సత్వరమే కబ్జాకోరులపై చర్యలకు ఉపక్రమించాలని విజ్ఞప్తి చేశారు.
–బొబ్బిలి

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?



కూటమి ప్రభుత్వంలో పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయం జరుగుతుండడం విచారకరమని సీపీఐ నాయకులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్‌లు అన్నారు. ఇదే విషయమై వారు బొబ్బిలిలోని సీపీఐ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. బొబ్బిలి పాకివీధిలో పారిశుధ్య కార్మికుల ఇళ్ల నిర్మాణాల కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలను మళ్లీ లాక్కోవాలనుకోవడం దుర్మార్గమన్నారు. ఇందిరమ్మ కాలనీలో నకిలీ పట్టాలు సృష్టించి, ప్రభుత్వ స్థలాలు కాజేస్తున్న వారిని వదిలేసి, నిరుపేదలైన పారిశుధ్య కార్మికులపై దౌర్జన్యం చేయడమేంటని ప్రశ్నించారు. వారికి ఇచ్చిన స్థలాల్లో వారు వేసుకున్న పాకలు తొలగించడమేంటని నిలదీశారు. పారిశుధ్య కార్మికులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని, పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.
–బొబ్బిలి

పేదల సొంతింటి కల దూరం చేసే కుట్ర



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

- కూటమి ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే శంబంగి మండిపాటు

రామభద్రపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదలకు ఇచ్చిన ఇళ్లస్థలాల్లో నిర్మాణాలు చేపట్టని వారి ఇళ్లపట్టాల రద్దుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, వారి సొంతింటి కలను దూరం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మండిపడ్డారు. ఇదే విషయమై ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలోని చంద్రబాబు ప్రభుత్వం ఒక్క కొత్త ఇల్లు ఇవ్వకపోగా గత ప్రభుత్వంలో పేదలకు మంజూరైన ఇళ్లను రద్దు చేసేందుకు ప్రయత్నిస్తుండడం దుర్మార్గమన్నారు. పేదల ఉసురు తప్పకుండా తగులుతుందన్నారు. లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్లపట్టాల్లో 24 నెలల లోపు ఇళ్లు నిర్మించుకోవాలని ఉందని, ఇప్పుడు గడువు ఉండగానే వారి ఇళ్ల రద్దుకు అధికారులపై కూటమి నాయకులు, ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడం సరి కాదన్నారు. పేదలకు అన్యాయం చేయాలని చూస్తే వారి తరఫున పోరాటం చేసేందుకు వెనుకాడబోమన్నారు. చేతిలో చిల్లిగవ్వ లేక ఇల్లు కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నవారికి ఆర్థికసాయం చేయాల్సింది పోయి వారి ఇళ్లను వెనక్కి తీసుకోవడమేంటని నిలదీశారు. అధికారం శాశ్వతం కాదని, అత్యుత్సాహం చూపుతున్న అధికారులు మూల్యం చెల్లించకోక తప్పదని హెచ్చరించారు. పేదలకు మంచి చేయాలన్న ఆలోచన ఉంటే భూమి కొనుగోలు చేసి పేదలకు పంచాలని సవాలు విసిరారు. పేదల ఇళ్లను వెనక్కి తీసుకునే ప్రక్రియను నిలిపివేయాలని లేకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు డర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజీకి అనుకూలమైన కేసులను పరిష్కరించుకోవాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శారదాంబ

రాజాం సిటీ: రాజీకి అనుకూలమైన కేసులను మార్చి 8వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ కోరారు. స్థానిక కోర్టు సముదాయంలో పోలీసులు, రెవెన్యూ, బ్యాంకు, ఎక్సైజ్ సిబ్బందితో శనివారం సమావేశమైన ఆమె మాట్లాడుతూ కక్షిదారులకు అవగాహన కల్పించి, వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పే అంతిమమని, దీనికి కక్షిదారులు కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కక్షలు, కార్పణ్యాలకు పోయి సమయం, డబ్బు వృథా చేసుకోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ, ఏజీపీ ఎస్.పోలారావు, సీనియర్ న్యాయవాదులు ఆర్.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం వాడవాడలా శనివారం జరిగింది. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్యారోగ్య సిబ్బంది అంతా కార్యక్రమంలో పాల్గొని, తమ పని ప్రదేశాల వద్ద పరిసరాలను చీపుళ్లతో ఊడ్చి పరిశుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యమని, ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు.
–బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రాజాం సిటీ: రాజాం మండల పరిషత్ కార్యాలయ పరిసరాలను చీపుళ్లతో శుభ్రం చేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



రేగిడి: ఉంగరాడమెట్ట గురుకులంలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు



తెర్లాంలో ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రాంబాబు



బాడంగి మండల పరిషత్ కార్యాలయంలో పరిసరాలు పరిశుభ్రం చేస్తున్న ఎంపీడీవో రామకృష్ణ, తదితరులు



బొబ్బిలిరూరల్: బొబ్బిలి ఎంపీడీవో కార్యాలయంలో పరిసరాలను పరిశుభ్రం చేయిస్తున్న ఎంపీడీవో రవికుమార్ తదితరులు

ప్రయోగ పరీక్షలు ప్రారంభం

వంగర: మండలంలోని మడ్డువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో ఈ పరీక్షలు జరుగుతున్నాయని, పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ కోట రవిశంకర్ తెలిపారు. శనివారం పరీక్షలకు మొత్తం 82 మంది విద్యార్థులకు గాను 80 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు.

ఉపాధ్యాయులకు ‘క్లస్టర్’ కష్టాలు



డోలపేట పాఠశాలలో అటెండెన్స్ కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులు

రాజాం సిటీ: క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైన ఉపాధ్యాయులు అవసోపాలు పడాల్సి వచ్చింది. శనివారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు కేటాయించిన పాఠశాలలకు ఉపాధ్యాయులు చేరుకున్నారు. అప్పటివరకు బాగానే ఉంది. మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సమావేశం జరగ్గా, ఉపాధ్యాయులంతా యాప్‌లో అటెండెన్స్ వేసేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చిందని పలువురు వాపోయారు. సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు అటెండెన్స్ పడకపోవడంతో పాఠశాల ఆవరణలోనే నిరీక్షించాల్సి వచ్చిందని, ఇదేమి క్లస్టర్ సమావేశాలు అంటూ ప్రభుత్వ తీరుపై పలువురు ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. ఇదిలా ఉండగా, రాజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ప్రధానోపాధ్యాయుడు పి.నాగయ్య 117 జీవో మార్పు, క్లస్టర్ కాంప్లెక్స్ ఏర్పాటు, విధి విధానాలు, మోడల్ లెస్సన్ ప్లాన్ రూపకల్పన, బోధన, పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతకు 100 రోజుల యాక్షన్ ప్లాన్ వంటి అంశాలపై చర్చించారు.

హోం గార్డెనింగ్‌పై అవగాహన

బొబ్బిలిరూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో హోం గార్డెనింగ్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఇంటి శ్లాబ్‌పై పూల తోటలు, కూరగాయలు పండించుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు. హోం గార్డెనింగ్ ద్వారా ఇంటికి అవసరమైన కూరగాయలు, పూలు సంపాదించుకోవచ్చన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్



మాట్లాడుతున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులు, దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఆయనపై ఏ ఒక్కరూ ఎటువంటి ఫిర్యాదు చేయకపోయినా కేవలం కక్షపూరితంగా ఆయనను అరెస్ట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీలో జనాదరణ ఉన్న నాయకులను ఇబ్బంది పెట్టి అయినా టీడీపీలో చేర్చుకునేందుకు ఆ పార్టీ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ పార్టీ ప్రజాబలం మెండుగా ఉన్న పార్టీ అని, ఎవరు ఎన్ని కుతంత్రాలు చేసినా, ఎన్ని కుట్రలు పన్నినా ప్రజల ఆశీర్వాదాలు ఎప్పుడూ తమ పార్టీకి ఉంటాయన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న దారుణాలను ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయం చూసి వారే తగిన బుద్ధి చెబుతారన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని, హామీలు అమలులో చిత్తశుద్ధి చాటుకోవాలని హితవుపలికారు.

ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పక్కనే డాక్టర్ తలే రాజేష్

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ డిమాండ్

రేగిడి: రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి, వారు మాట్లాడారు. చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు లక్ష్యం పూర్తయిందని ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను నిలిపివేయడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం ఎక్కడా ధాన్యం కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఖరీఫ్ వరి పంట పొలాల్లోనే కుప్పలుగా పెట్టుకున్నారని, అప్పటికే పొలాల్లో సాగులో ఉన్న అపరాల పంటలు చేతికి వస్తే గానీ ఆ కుప్పలు కళ్లాలకు తరలించి నూర్పిడి చేయడం సాధ్యం కాదన్నారు. ఈ కారణంగా కొన్నిచోట్ల రైతులు ఇప్పుడు వరి నూర్పిడి చేస్తున్నారని, వారి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. తమ ధాన్యం కొనుగోలు చేయాలని పలువురు రైతులు అధికారుల వద్దకు వెళ్లి మొర పెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని అన్నదాతలు వాపోతున్నారన్నారు. రైతు సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తుందనడానికి ఇదే చక్కని నిదర్శనమన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎన్నికల హామీలు ఎలాగో నెరవేర్చలేకపోతున్నారు.. కనీసం రైతుల సమస్యలనైనా పరిష్కరించాలని వారికి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, రాజాం నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం ధరల పెంపుపై మండిపాటు

బాడంగి: రాష్ట్రంలో మద్యం ధరలు విపరీతంగా పెంచడంపై మందుబాబులు మండిపడుతున్నారు. ఎన్నికల సమయంలో నాణ్యమైన మద్యం ఇస్తాం, మందు ధరలు తగ్గిస్తామని సీఎం చంద్రబాబు చెప్పి, ఇప్పుడు రేట్లు పెంచడం దారుణమన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మద్యపాన నిషేధం దిశగా చర్యలు తీసుకుంటూ మద్యం ధరలు పెంచితే అదిగో పెంచేశారు.. ఇదిగో పెంచేశారని కూటమి నాయకులు గోలగోల చేశారని, ప్రస్తుతం వారే అధికారంలోకి వచ్చిన ఏడెనిమిది కాలంలోనే మద్యం ధరలు పెంచడాన్ని ఏ విధంగా చూడాలని ప్రశ్నిస్తున్నారు. నమ్ముతున్నారా కదా అని మోసం చేస్తే రానున్న రోజుల్లో పార్టీ భవితవ్యం తేలుస్తామని హెచ్చరిస్తున్నారు.



నూతన మద్యం ధరల పట్టిక